క్లుప్తంగా

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



రోడ్డు పక్కన బోర్డులను తొలగిస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని టవర్ సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా దుకాణాల ముందు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దుకాణదారుడు తన షాపు బోర్డులను షాపు లోపలే పెట్టాలని, బయటపెట్టి ట్రాఫిక్ అంతరాయం కలిగేలా చేయవద్దన్నారు. రోడ్డుపై కూరగాయలు విక్రయించొద్దని సూచించారు.

షార్ట్‌పుట్ పోటీల్లో గురుకులం విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ముత్తయ్య

జగిత్యాల: అండర్–16 బాలుర విభాగంలో షార్ట్‌పుట్ 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో గొల్లపల్లి గురుకుల సాంఘీక సంక్షేమ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ ప్రతిభ కనబర్చి రెండో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య, శ్రీలత, పీఈటీ సంతోష్, అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిశ్వాంత్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈనెల 16న జగిత్యాలలోజిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 20 నుంచి వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా రిశ్వాంత్‌ను హెచ్ఎం శ్రీనివాస్, చైర్మన్ అంజలి అభినందించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని వార సంతతో పాటు పలు బేకరీల్లో మంగళవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల వినియోగిస్తున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.2500 జరిమానా వసూలు చేశారు. కవర్లకు బదులు జ్యూట్ సంచులు వాడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో రత్నాకర్, ప్రవీణ్, విజయ్, శ్రీనివాస్, ముజీబ్, పున్నం తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురికి కంటి వైద్య పరీక్షలు చేశారు. కొందరికి కంటి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ అవసరమున్న వారిని లయన్స్ క్లబ్ తరఫున ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం



స్పోర్ట్స్ మీట్‌లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

జగిత్యాల: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం ఉంటుందని ఎంఈవో భీమయ్య అన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని రామాలయంలో స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పిరమిడ్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గౌతమ స్కూల్ చైర్మన్ కైలాసం, భీమయ్య పాల్గొన్నారు.

పాడవుతున్నాయి.. పట్టించుకోండి



పెచ్చులూడుతున్న న్యూ హరిజన వాడ పాఠశాల



మూలకు పడేసిన డెస్కులు

ధర్మపురి: లక్షలాది రూపాయలతో విద్యార్థుల కోసం కొనుగోలు చేసిన డెస్కులు నిరుపయోగంగా మారాయి. ఉపాధ్యాయులు వాటిని ఉపయోగించక ఓ మూలన పడేశారు. నూతన గది నిర్మిస్తే ఆ డెస్కులు ఉపయోగంలోకి వస్తాయి. ధర్మపురి న్యూ హరిజన వాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గత ప్రభుత్వం మన ఊరు మన బడి కింద ఎంపిక చేసింది. పాఠశాలలో ఒక గది, ఒక వరండాతో పాటు శిథిలమైన మరో గది ఉంది. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులుండగా 52 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మౌలిక వసతులతో పాటు చిన్న పాటి మరమ్మతులు చేపట్టారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఆరు నెలల క్రితం 52 డెస్కులను మంజూరు చేసింది. కాని వాటిలో 20 డెస్కులను మాత్రమే విద్యార్థులకు ఉపయోగిస్తుండగా మిగిలిన 32 డెస్కులు గదులు లేక మూలకు పడేశారు. దీంతో అవి తుప్పుపట్టి పోతున్నాయి.

నూతన గది నిర్మిస్తే ఉపయోగం..

పాఠశాలలో ఉన్న ఒక గది శిథిలమై ప్రమాదకరంగా మారింది. దీన్ని తొలగించి నూతన తరగతి గది నిర్మాణం కోసం జిల్లా విద్యాశాఖ అధికారులకు విన్నవించారు. నిధుల కొరతతో నూతన గది నిర్మాణానికి నోచుకోలేక పోతుంది. గది నిర్మిస్తేనే డెస్కులు ఉపయోగంతో పాటు విద్యార్థుల చదువులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయంపై ఎంఈవో సీతామహలక్ష్మిని వివరణ కోరగా నూతన గది నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించామని, నిధులు మంజూరైతే గది నిర్మిస్తామని, ప్రస్తుతం రెండు గదుల్లో బోధన కొనసాగుతుందని తెలిపారు.



కథలాపూర్: మండలంలోని గ్రామాలకు కోరుట్ల డిపో నుంచి నడిచే ఆర్టీసీ బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కొరతతో వచ్చిన బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ ప్రత్యేకంగా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: మనోహర్, ఆర్టీసీ డిపో మేనేజర్, కోరుట్ల సెల్ నంబర్: 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బిల్లు రాదు.. సబ్ సెంటర్ పూర్తి కాదు

- పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
- గత ప్రభుత్వంలో రూ.20 లక్షలు మంజూరు
- పట్టించుకోని అధికారులు



అరవెల్లిలో నిలిచిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం

పెగడపల్లి: మండలంలోని అరవెల్లిలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్లాబ్, గోడల వరకు పనులు జరిగి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ ఇతర పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లు రాలేదని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. పెగడపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అరవెల్లిలో ఉప కేంద్రానికి పక్కా భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. పనులు పొందిన కాంట్రాక్టర్ కొంతవరకు పనిచేసి, బిల్లు రావడం లేదనే కారణంతో పనులు ఆపేశాడని అధికారులు తెలిపారు.

ఏడాదిగా నిలిచిన పనులు

ఏడాదిగా పనులు నిలిపివేసినా అధికారులు పట్టించుకోక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్యోగ కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. ఇక్కడ పల్లె దవాఖానా ఏర్పాటు చేసి ఓ డాక్టర్‌ను కూడా ప్రభుత్వం నియమించింది. ఆరోగ్య సమస్యలున్న వివిధ రకాల వ్యాధిగ్రస్తులు తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. దీనికి తగిన వసతులు లేక రోగులతో పాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. భవన నిర్మాణం నిలిచి పోవడంతో నిధులు వృథాగా పోతున్నాయని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈఈ శంషేర్ అలీని వివరణ కోరగా బిల్లు రాక లేక కాంట్రాక్టర్ పనులు నిలిపేశాడని పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ కనబర్చాలి

- జిల్లా విద్యాధికారి రాము



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

జగిత్యాల: విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌లలో ప్రతిభ కనబర్చాలని డీఈవో రాము అన్నారు. మంగళవారం ఓల్డ్ హైస్కూల్‌ను ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి సబ్జెక్ట్‌లో మెళుకువలు నేర్చుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన సహకారం అందించాలన్నారు.

మేడిపల్లి పాఠశాల తనిఖీ

మేడిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం డీఈవో రాము తనిఖీ చేశారు. తరగతి లోని విద్యార్థులను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వివిధ పరీక్షల జవాబు పత్రాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం బోధించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు



స్టిక్కర్లు అంటిస్తున్న ఎస్సై, యూనియన్ సభ్యులు

బుగ్గారం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాలకు రేడియం స్టిక్కర్లను అంటించుకోవాలని బుగ్గారం ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం బుగ్గారం మండల ట్రాక్టర్స్ యూనియన్ సహకారంతో పలు వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రేడియం స్టిక్కర్లను వాహనాలకు అతికించడం వలన ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మండల ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సొసైటీ చైర్మన్ సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్

రాయికల్: రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల చైర్మన్ల పదవీకాలం ఆరునెలల పాటు పొడగించగా, మంగళవారం రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

బీఆర్ఎస్ తప్పిదాలే కాంగ్రెస్ చేస్తోంది



కోరుట్లలో వాకర్లను ఓట్లు అభ్యర్థిస్తున్న భోగ శ్రావణి

మెట్‌పల్లిరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో మంగళవారం గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే శాసనమండలిలో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి,నాయకులు నవీన్, సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు భోగ శ్రావణి అన్నారు. పట్టణంలోని వాకర్స్ ను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీచర్స్ ఎమ్మెల్సీ కన్వీనర్ వడ్డెపల్లి శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, సుదవేణి మహేశ్, పాల్గొన్నారు.

సారంగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని బీజేపీ నాయకులు మంగళవారం మండలంలోని పెంబట్ల–కోనాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జీ రెంటం జగదీష్, ప్రభారి అయ్యన్న, నలువాల తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.

మల్యాల: పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థుల తరఫున బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం మల్యాలలో బీజేపీ, బీజేవైఎంమోర్చా నాయకులు ప్రచారం చేపట్టారు. పట్టభద్రులను ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఫేర్‌వెల్ డేలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు,విద్యార్థులు

మల్లాపూర్: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఫేర్‌వెల్ డేలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. మోడల్ స్కూల్, కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోనే ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. మోడల్ స్కూల్‌లో చేరాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్ షోలు, అభినయ కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తేజశ్విని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా కవిత

కోరుట్ల: కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మచ్చ కవిత రెండో సారి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, తదితరులకు కవిత కృతజ్ఞతలు తెలిపారు.

గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూదరి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, డైరెక్టర్లుగా చెర్లపల్లి సత్తెమ్మ, అంగ లక్ష్మీబాయి, ఎనగందుల శ్రీనివాస్, గుండవేని ప్రణయ్, పొన్నం శ్రీనివాస్, గొట్టిపర్తి రాజేందర్, బక్కూరి రమేష్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సంఘం సభ్యులు సన్మానించారు.

'కల్వర్టు నిర్మాణంలో నాణ్యతా లోపం'

మల్లాపూర్: కల్వర్టు నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని కాంగ్రెస్ నాయకులు ఎల్కా కమలాకర్ అన్నారు. మండలంలోని ఒబులాపూర్ శివారులో నిర్మిస్తున్న కల్వర్టును ఆయన మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్, సిబ్బందిని నిలదీశారు. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు 61వ జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు దెబ్బతిన్నదని, తాత్కాలిక మరమ్మతు చేయగా.. రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. గత వర్షాకాలంలో మళ్లీ దెబ్బతినడంతో మట్టి పోశారని, ఇటీవల కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరుకాగా పాతపైపులను వినియోగిస్తూ నాణ్యతప్రమాణాలు పాటించడం లేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి పనులు నాణ్యతగా చేయాలని, లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: యాసంగిలో రైతులు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సింగిల్ విండో అధికారులు, ఐకేపీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసేందుకు స్థలాలు, ప్యాడీ క్లీనర్లు, తాగునీటి వసతి, గన్ని సంచులు, విద్యుత్ సరఫరా, తూకం కాంటాలు, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఏవో రాజ్‌కుమార్, సొసైటీ సీఈవోలు సతీశ్, నిరంజన్, ఎఫ్‌పీవో సీఈవో శ్రీధర్, ఐకేపీ సీపీ సాయేందర్, వీవో శ్రీలత పాల్గొన్నారు.

క్రైం వార్తలు

వాహనాన్ని ఢీకొని మైనర్లకు గాయాలు

మల్యాల:మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లు బైక్‌పై వెళ్తూ రాజారం గ్రామం వద్ద ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలో రాములు అనే వ్యక్తితోపాటు మైనర్లు స్వల్పంగా గాయపడ్డారు. రాములును 108లో జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా ప్రమాదాలు జరిగి, వారి భవిష్యత్ నాశనం అవుతోందని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

- బైండోవర్ అతిక్రమించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

జగిత్యాలక్రైం:కొడిమ్యాల మండలం గంగారాంతండాకు చెందిన భూక్య రామేశం నాటుసారా అమ్ముతూ పలుమార్లు ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. ఆయనను గతంలో కొడిమ్యాల తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. అయినా అతను మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడటంతో మంగళవారం తహసీల్దార్ ముందు హాజరుపర్చగా అతనికి రూ.50 వేల జరిమానా విధించారు. జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

- ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి: మల్లాపూర్ మండలంలోని సాతారాం నుంచి అక్రమంగా మెట్‌పల్లికి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండింటిలో ఒకటి వేంపేట గ్రామం వద్ద.. మరొకటి పట్టణ శివారులో పట్టుకుని వాటి యజమానులు ప్రశాంత్, మురళీ, డ్రైవర్ బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

- ఇసుక రవాణా అడ్డుకట్టకు చెక్‌పోస్ట్

మెట్‌పల్లిరూరల్: ఇసుక అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ అన్నారు. జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయం సమీపంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. మంగళవారం చెక్‌పోస్ట్‌ను సందర్శించి రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి పలు సలహాలు,సూచనలు చేశారు. ఇసుక తరలిపోకుండా పకడ్బందీగా నిఘా పెట్టాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సమాచారం

ఇసుక డంపులకు నేడు వేలం

మల్లాపూర్: రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న సుమారు ఇసుకడంపులకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్ సింగ్ తెలిపారు. ఈ వేలంపాటలో పాటపాడిన వ్యక్తులకు ఇసుకను విక్రయించుటకు, రవాణా చేసేందుకు అనుమతించనున్నట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వాల్టా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

మెట్‌పల్లి: హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మెట్‌పల్లి న్యాయవాదులు కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో నూతన కోర్టు భవనంతో పాటు జిల్లా అడిషనల్ కోర్టును మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న జాతర ఉత్సవాలు



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ముగిశాయి. ఐదు రోజుల పాటు వైభవంగా సాగిన జాతర ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరయ్యారు. మంగళవారం ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి నాగవెల్లి నిర్వహించారు. భక్తులు అగ్నిగుండంలో నుంచి నడుస్తూ వెళ్లారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.